


# మన దునియా

Our World Our News

మన అక్షరం - మన ప్రపంచం

RNI Number TELTEL/2023/85680



రిపోర్టర్లు కావలెను

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

తెలుగు రాష్ట్రాలలో సంచలనాలు సృష్టిస్తున్న మన దునియా మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాలు, మండలాలు మరియు నియోజకవర్గాలు పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తోంది. రిపోర్టర్లు కావాలి.

సంప్రదించుటకు సంప్రదించండి...
9490056011,9603969335



సంపుటి : 4 | సంచిక : 24 | సెప్టెంబర్ 29 మంగళవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


# రంగారెడ్డి జిల్లాలో 'బంగారు బాతు' ఎక్సైజ్ స్థానం ఎవరిది..?




- ఎక్సైజ్ పోస్టింగ్ కోసం 'పైరవీల' వేట..!
- ఆ స్థానం కోసం లక్షల ఖర్చు.. నెలకు లక్షల ఆశలు..!
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ శాఖ అధికారి ఎవరు..?
- 'గోల్డెన్ పోస్టింగ్' కోసం భారీ పైరవీలు..!
- జీతం లక్షల్లో.. ఆదాయం మాత్రం కోట్లలోనా..?
- వైన్స్ నుంచి బెల్ట్ షాపుల దాకా.. ఆ సిఐ మామూళ్ల మాయాజాలం
- రంగారెడ్డి జిల్లాలో ఎక్సైజ్ 'గోల్డెన్ చైర్' ఎవరిది..?
- ఆ నియోజకవర్గ ఎక్సైజ్ పోస్టుపై ఎందుకంత మోజు..?

**మన దునియా,రంగారెడ్డి జిల్లా:సెప్టెంబర్ 28**

రంగారెడ్డి జిల్లాలోని ఓ నియోజకవర్గం ఎక్సైజ్ శాఖలో అధికారుల పోస్టింగ్‌పై ఇప్పుడు ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. మినీ ఇండియాగా పేరొందిన ఈ నియోజకవర్గంలో ఎక్సైజ్ శాఖ అధికారిగా పనిచేసేందుకు కొందరు అధికారులు తీవ్రంగా ఆసక్తి చూపుతున్నారనే ప్రచారం జరుగుతోంది. పోస్టింగ్ కోసం పెద్ద ఎత్తున పైరవీలు, ముడుపుల వ్యవహారం నడుస్తోందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆ నియోజకవర్గంలో ఎక్సైజ్ శాఖ పరిధిలోని వైన్స్, బార్లు, కల్లు దుకాణాలు, బెల్ట్ దుకాణాల సంఖ్య

(మిగతా 2వ పేజీలో..)

## 'తాయ్ మామన్' పథకానికి శ్రీకారం.. మేనమామలా మారిన సీఎం విజయ్

- 'తాయ్ మామన్' గోల్డ్ రింగ్ పథకాన్ని ప్రారంభించిన సీఎం విజయ్
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో పుట్టిన శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరం
- మధురై రాజాజీ ఆసుపత్రిలో చిన్నారులకు స్వయంగా ఉంగరాలు తొడిగిన సీఎం
- కొందరు చిన్నారులకు సంప్రదాయబద్ధంగా నామకరణం కూడా చేసిన విజయ్

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేడు మధురైలో 'తాయ్ మామన్' గోల్డ్ రింగ్ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించిన శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరాన్ని అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. మధురైలోని ప్రభుత్వ రాజాజీ ఆసుపత్రిలో జరిగిన ఈ కార్యక్రమం ద్వారా సీఎం విజయ్ ఈ బృహత్తర పథకానికి శ్రీకారం చుట్టారు.బిస్కెట్ కలర్ చొక్కా, పంచె ధరించిన సీఎం విజయ్, వేదికపై ముగ్గురు శిశువులకు స్వయంగా బంగారు ఉంగరాలు తొడిగి

(మిగతా 2వ పేజీలో..)



## యువకుడిపై చేయి చేసుకున్న మంత్రి... తీవ్రంగా స్పందించిన రాహుల్ గాంధీ

- ఢిల్లీలో యువకుడిపై చేయి చేసుకున్న మంత్రి పర్వేశ్ వర్మ
- ఇదంతా అధికార అహంకారమేనని రాహుల్ ఘాటు వ్యాఖ్యలు
- ఆయనకు విషయం తెలియదంటూ మంత్రి కౌంటర్



ఢిల్లీలో ఓ యువకుడిపై బీజేపీ మంత్రి భౌతిక దాడికి దిగిన ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. అధికార మదంతో బీజేపీ నేతలు ప్రవర్తిస్తున్నారని, వారికి ఓటర్లంటే కనీస భయం లేదని ఆయన ధ్వజమెత్తారు

(మిగతా 2వ పేజీలో..)

## ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ.. గెజిట్ విడుదల చేసిన అసెంబ్లీ

- దానం నాగేందర్‌పై అనర్హత వేటుతో ఖైరతాబాద్ స్థానం ఖాళీ
- అసెంబ్లీ నుంచి అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ
- హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు
- ఉప ఎన్నికలో గెలుపుపై ధీమా వ్యక్తం చేసిన దానం నాగేందర్



తెలంగాణలో ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ఖాళీ

(మిగతా 2వ పేజీలో..)

## ఇప్పుడు గుజరాత్ వర్సెస్ దేశం: రేవంత్ రెడ్డి

- కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు
- ఇది నార్త్ వర్సెస్ సౌత్ కాదు, గుజరాత్ వర్సెస్ దేశం అని వ్యాఖ్య
- ఓటర్ల జాబితా నుంచి 13 కోట్ల ఓట్లు తొలగించారని ఆరోపణ
- రాహుల్ గాంధీని కలిశాకే కాంగ్రెస్‌లో చేరానన్న రేవంత్
- తెలంగాణ అభివృద్ధికి మోదీ సర్కార్ సహకరించడం లేదని విమర్శ

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై సంచలన ఆరోపణలు చేశారు. ప్రస్తుతం దేశంలో ఉత్తర, దక్షిణ భారత్ మధ్య కాకుండా, 'గుజరాత్ వర్సెస్ దేశం' అన్నట్లుగా పరిస్థితులు నెలకొన్నాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. అసోంకు చెందిన

(మిగతా 2వ పేజీలో..)




## హైదరాబాద్‌లో మళ్లీ చెడ్డీ గ్యాంగ్ కలకలం..

- హైదరాబాద్ మణికొండలో చెడ్డీ గ్యాంగ్ ప్రత్యక్షం
- అపార్ట్‌మెంట్‌లో చోరీకి పాల్పడి మహిళపై దాడి
- కేసు దర్యాప్తునకు మూడు ప్రత్యేక పోలీస్ బృందాల ఏర్పాటు
- సెక్యూరిటీ గార్డుల పాత్రపై ఆరా తీస్తున్న పోలీసులు



హైదరాబాద్ నగరంలో మరోసారి చెడ్డీ గ్యాంగ్ కలకలం రేపింది. మణికొండలోని ఒక అపార్ట్‌మెంట్‌లోకి

(మిగతా 2వ పేజీలో..)

మన దునియా

# హైదరాబాద్‌లో మళ్లీ చెడ్డీ గ్యాంగ్ కలకలం..

(మొదటి పేజీ తరువాయి)

చొరబడిన ఈ ముఠా సభ్యులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే, నిన్న తెల్లవారుజామున మణికొండలోని ఓ అపార్ట్‌మెంట్‌లోకి చెడ్డీ గ్యాంగ్ సభ్యులు ప్రవేశించారు. నివాసంలోకి చొరబడి దొంగతనానికి పాల్పడుతుండగా, ఒక మహిళ వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో ఆగ్రహించిన దుండగులు ఆమెపై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఆరుగురు సభ్యులు అపార్ట్‌మెంట్‌లోని ఒక బ్లాక్‌లో సంచరిస్తున్న దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. ఈ వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను పట్టుకునేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు, స్థానిక సెక్యూరిటీ గార్డులకు ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణంలోనూ పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనతో చుట్టుపక్కల అపార్ట్‌మెంట్ల వాసులు భయాందోళన చెందుతున్నారు.

# యువకుడిపై చేయి చేసుకున్న మంత్రి...

## తీవ్రంగా స్పందించిన రాహుల్ గాంధీ

(మొదటి పేజీ తరువాయి)

వివరాల్లోకి వెళితే... ఢిల్లీ పీడబ్ల్యూడీ మంత్రి పర్వేశ్ వర్మ ఆదివారం తన నియోజకవర్గ పరిధిలోని తిలక్ నగర్‌లో రోడ్ల పనులను తనిఖీ చేశారు. ఆ సమయంలో ఓ యువకుడు రహదారుల నిర్మాణంలోని లోపాలపై ప్రశ్నిస్తూ వీడియో తీయడం ప్రారంభించాడు. దీంతో ఆగ్రహానికి గురైన మంత్రి ఆ యువకుడి చెంపపై కొట్టారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ ఉదంతంపై రాహుల్ గాంధీ మండిపడ్డారు. "ప్రజలు బహిరంగంగా ప్రశ్నిస్తే చెంపదెబ్బ, పేపర్ లీకేజీలపై నిలదీస్తే లాఠీఛార్జ్, పార్లమెంటులో గళమెత్తితే మైక్ ఆఫ్ చేయడం.. ఇవన్నీ అధికార అహంకారానికి నిదర్శనం" అని ఆయన పేర్కొన్నారు. ఓట్లు దొంగిలించి అధికారంలోకి వస్తున్నందునే, తప్పు చేస్తే ప్రజలు గద్దె దించుతారన్న భయం వారిలో లేకుండా పోయిందని రాహుల్ ఆరోపించారు. ఇలాంటి పార్టీలకు ప్రజల మద్దతుతో పనిలేదని ఆయన వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ విమర్శలపై మంత్రి పర్వేశ్ వర్మ స్పందించారు. ఈ విషయం గురించి రాహుల్‌కు కనీస అవగాహన లేదని, ఆయన ఇటువంటి అంశాలకు దూరంగా ఉంటేనే మంచిదని హితవు పలికారు.

# మన్ కీ బాత్'లో ఉసిరిపై ప్రధాని ప్రశంసలు..

## ఆరోగ్యంతో పాటు ఆదాయానికి మార్గం!

**'మన్ కీ బాత్'లో ఉసిరిని సూపర్‌ఫుడ్‌గా అభివర్ణించిన ప్రధాని మోదీ**

**ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్‌లో ఉసిరి పరిశ్రమ విజయవంతమైందని వెల్లడి**

**'ఓకల్ ఫర్ లోకల్' నినాదానికి ఉసిరి సాగు ఊతమిస్తుందని పిలుపు**

ప్రధాని నరేంద్ర మోదీ తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' తాజా ఎపిసోడ్‌లో భారతీయ సంప్రదాయ ఫలం ఉసిరిపై ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఉసిరికాయను ఒక 'సూపర్‌ఫుడ్'గా అభివర్ణించిన ఆయన, ఇది రుచికి రుచిని, ఆరోగ్యానికి ఆరోగ్యాన్ని అందిస్తుందని కొనియాడారు. కేవలం ఆరోగ్య ప్రయోజనాలకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవనోపాధిని మెరుగుపరచడంలో ఉసిరి కీలక పాత్ర పోషిస్తోందని ఆయన వివరించారు. ఈ స్థానిక ఫలాన్ని ప్రోత్సహించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థతో పాటు పౌష్టికాహార భద్రతను కూడా బలోపేతం చేయవచ్చని ప్రధాని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్ జిల్లాను ప్రధాని మోదీ ఉదాహరణగా చూపించారు. ఈ ప్రాంతానికి ఉసిరితో శతాబ్దాల అనుబంధం ఉందని, ప్రస్తుతం 'ఒక జిల్లా – ఒక ఉత్పత్తి' (ఓడీఓపీ) పథకం కింద ఇక్కడి ఉసిరి పరిశ్రమకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. ప్రతాప్‌గఢ్‌లో దాదాపు 100 ఉసిరి ప్రాసెసింగ్ యూనిట్లు పనిచేస్తున్నాయని, వీటిలో మహిళా స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రశంసించారు. దేవ్‌గఢ్ కమాసీ గ్రామంలోని సావిత్రి పూలే స్వయం సహాయక బృందం ఉసిరితో క్యాండీ, మురబ్బా, జ్యూస్ వంటివి తయారు చేస్తోందని, వింధ్యవాసిని బృందం పచ్చళ్లు, జీర్ణశక్తిని పెంచే పొడులను ఉత్పత్తి చేస్తోందని మోదీ ఉదహరించారు. ప్రభుత్వ సహకారంతో యంత్రాలు, రుణాలు, మార్కెట్ సౌకర్యాలు అందుబాటులోకి రావడం వల్ల ఈ మహిళల ఆదాయం గణనీయంగా పెరిగిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఉసిరిలో ఉండే పోషక విలువల గురించి కూడా ప్రధాని మాట్లాడారు. నారింజ పండుతో పోలిస్తే ఉసిరిలో అనేక రెట్లు ఎక్కువ విటమిన్ సి ఉంటుందని శాస్త్రీయంగా నిరూపితమైందని గుర్తుచేశారు. విటమిన్ సి తో పాటు యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్, ఇతర సూక్ష్మ పోషకాలు ఉసిరిలో పుష్కలంగా ఉంటాయన్నారు. దీనిని రోజూవారీ ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు, జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుందని, చర్మం, జుట్టు ఆరోగ్యం కూడా బాగుంటుందని పేర్కొన్నారు. రక్తంలో చక్కెర స్థాయిలు, కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలోనూ ఉసిరి సహాయపడుతుందని ప్రధాని వివరించారు. మన ఇళ్లలో ఊరగాయలు, మురబ్బా, చ్యవన్‌ప్రాశ్ వంటి రూపాల్లో ఉసిరిని ఎప్పటినుంచో వాడుతున్నామని, ఈ సంప్రదాయాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ప్రధాని కోరారు. ఉసిరి వంటి స్థానిక సూపర్‌ఫుడ్‌లను ప్రోత్సహించడం 'ఓకల్ ఫర్ లోకల్' నినాదానికి నిజమైన స్ఫూర్తినిస్తుందని అన్నారు. తక్కువ ధరకే లభించే ఇలాంటి పోషకాహారం ద్వారా దేశంలో పోషకాహార లోపాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని, తద్వారా ఆరోగ్యవంతమైన, స్వావలంబన కలిగిన భారతదేశాన్ని నిర్మించవచ్చని ప్రధాని మోదీ ఆకాంక్షించారు.



# రంగారెడ్డి జిల్లాలో 'బంగారు బాతు' ఎక్సైజ్ స్థానం ఎవరిది..?

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కువగా ఉండటంతో అక్కడ పనిచేసే అధికారులకు భారీగా అక్రమ ఆదాయం వస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు ఎక్సైజ్ సిఐ వైన్స్, కల్లు దుకాణాలు, బెల్టు షాపుల నుంచి ఒక్కొంటికి నెలకు సుమారు రూ.20 వేల చొప్పున, బార్ల నుంచి రూ.50 వేల చొప్పున మామూళ్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కల్లు దుకాణాలు, బెల్ట్ దుకాణాలు, అనుమతి లేని వ్యాపారాల నుంచి కూడా నెలసరి వసూళ్లు జరుగుతున్నాయని స్థానికంగా చర్చ సాగుతోంది. దాదాపు మూడు పదుల వరకు వైన్స్ దుకాణాలు, 90కి పైగా కల్లు దుకాణాలు, ఇతర బెల్ట్ దుకాణాలు కలిపి నెలకు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు మామూళ్లు వస్తున్నాయనే ప్రచారం ఉంది. అయితే ఈ వసూళ్లకు సంబంధించి అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. ఇక కేసుల పేరుతో జరిగే వసూళ్లు, అనుమతులు లేని వ్యాపారాలపై చర్యలు తీసుకుంటామని చెప్పి జరిగే వ్యవహారాలు కలిస్తే ఆదాయం మరింత పెరుగుతుందనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో సాధారణ వేతనంతో పోలిస్తే అక్రమ మార్గాల్లో వచ్చే ఆదాయం భారీగా ఉంటుందనే చర్చ అధికార వర్గాల్లోనూ, స్థానికంగా కూడా సాగుతోంది.వ ఈ నేపథ్యంలోనే సదరు ఎక్సైజ్ కార్యాలయంలో పనిచేసేందుకు కొందరు అధికారులు భారీగా ఖర్చు చేసేందుకు సైతం వెనుకాడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోస్టింగ్ కోసం పెట్టిన ఖర్చుతో పోలిస్తే పనిచేసే కాలంలో వచ్చే అక్రమ ఆదాయం అనేక రెట్లు ఉంటుందనే భావనతోనే ఈ 'పోస్టింగ్ వేట' సాగుతోందనే విమర్శలు ఉన్నాయి. మరోవైపు ఆ నియోజకవర్గంలో ప్రజాప్రతినిధులు ఎక్సైజ్ శాఖలో అధికారుల నియామకాలు, అక్రమ మద్యం వ్యాపారాలు, మామూళ్ల ఆరోపణలపై తగినంత దృష్టి పెట్టడం లేదనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో ఎక్సైజ్ శాఖలో అధికారులదే ఇష్టారాజ్యమనే ఆరోపణలకు బలం చేకూరుతోందని స్థానికులు అంటున్నారు. ఎక్సైజ్ శాఖలో పోస్టింగ్ కోసం ఎంత ఖర్చు చేస్తున్నారనే అంశంపై స్పష్టత లేకపోయినా, 'పెట్టుబడి పెట్టి పోస్టింగ్ తెచ్చుకోవడం.. తర్వాత వసూళ్లతో పెట్టుబడిని రాబట్టుకోవడం' అనే వ్యవహారం నడుస్తోందనే ప్రచారం మాత్రం జోరుగా సాగుతోంది. రంగారెడ్డి జిల్లాలోనే కాకుండా గత ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలోనూ ఈ ప్రాంతంలోని ఎక్సైజ్ పోస్టుకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందనే చర్చ ఉంది. దీంతో అసలు ఈ 'గోల్డెన్ పోస్టింగ్' వెనుక ఉన్న అసలు కథ ఏమిటి..? పోస్టింగ్ కోసం నిజంగానే పైరవీలు, ముడుపుల వ్యవహారం జరుగుతోందా..? నెలకు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు మామూళ్లు వసూలవుతున్నాయన్న ఆరోపణల్లో వాస్తవమెంత..? అన్న ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. అధికారుల సమగ్ర విచారణ జరిగితేనే ఈ ఆరోపణల్లో వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది..

# ఇప్పుడు గుజరాత్ వర్సెస్ దేశం: రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

'ప్రతిదిన్' దినపత్రిక "భారత్ తదుపరి అధ్యాయం" అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధికి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏమాత్రం సహకరించడం లేదని ఆరోపించారు. రాష్ట్రానికి అత్యంత కీలకమైన రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) టెండర్లకు కేంద్రం ఉద్దేశపూర్వకంగానే అనుమతులు నిలిపివేసిందని మండిపడ్డారు. దేశం నిధులను గుజరాత్‌కు మాత్రమే తరలిస్తున్నారని, అందుకే ఇది గుజరాత్ వర్సెస్ దేశం అనే పోరాటంగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) పేరుతో కేంద్ర ప్రభుత్వం పెద్ద కుట్రకు పాల్పడుతోందని రేవంత్ ఆరోపించారు. ఈ ప్రక్రియ ద్వారా పేదలు, ప్రతిపక్ష మద్దతుదారుల ఓట్లను తొలగిస్తున్నారని, ఇప్పటికే దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించారని, భవిష్యత్తులో మరిన్ని ఓట్లు తొలగించే ప్రణాళికతో ఉన్నారని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా 'ఎస్ఐఆర్ గో బ్యాక్' ఉద్యమం రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల కమిషన్‌ను కేంద్రం తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని దుయ్యబట్టారు.

రెండుసార్లు కాంగ్రెస్ అభ్యర్థులపై గెలిచా

తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్న రేవంత్ రెడ్డి, ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులపై రెండుసార్లు గెలిచానని, అయితే నాటి ప్రభుత్వంతో పోరాడేందుకు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీలో చేరానని తెలిపారు. 2014 తర్వాత తెలంగాణలో పోరాటం ప్రధానంగా కేసీఆర్‌కు, తనకు మధ్యనే జరిగిందని, తాను అసెంబ్లీలో కంటే జైలులోనే ఎక్కువ సమయం గడపాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు. 2017లో రాహుల్ గాంధీని కలిసిన తర్వాత కాంగ్రెస్‌లో చేరానని, ఆయనే తన నాయకుడని నిర్ణయించుకున్నానని చెప్పారు. రాహుల్ గాంధీకి వ్యక్తిగత ఎజెండా లేదని, ఆయన దేశ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తారని కొనియాడారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీకి పెద్దగా ప్రాధాన్యం లేదని, రాష్ట్రంలో కాంగ్రెస్‌దే ఏకపక్ష ఆధిపత్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# 'తాయ్ మామన్' పథకానికి శ్రీకారం..

## మేనమామలా మారిన సీఎం విజయ్

(మొదటి పేజీ తరువాయి)

పథకాన్ని ప్రారంభించారు. తల్లులను ఆప్యాయంగా కుర్చీల్లో కూర్చోబెట్టి, పక్కనే ఉండి చిన్నారుల వేళ్లకు జాగ్రత్తగా ఉంగరాలు తొడిగారు. అనంతరం ఆయన వేదిక దిగి కింద కూర్చున్న మరో 12 మంది తల్లులు, వారి శిశువుల వద్దకు వెళ్లారు. అక్కడ చిన్నారులను చేతుల్లోకి తీసుకుని, వారి తల్లిదండ్రులతో ఆప్యాయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు పేరు పెట్టాలని సీఎం విజయ్‌ను కోరారు. వారి అభ్యర్థనను మన్నించిన ఆయన, చిన్నారులను ఎత్తుకుని సంప్రదాయబద్ధంగా మూడుసార్లు పేరును ఉచ్ఛరించి నామకరణం చేశారు. ఈ భావోద్వేగపూరిత క్షణాల్లో అక్కడున్న వారంతా హర్షం వ్యక్తం చేశారు. అనంతరం తల్లులతో సెల్ఫీలు దిగి, కరచాలనం చేసి వారిని ఉత్సాహపరిచారు. ఆ తర్వాత ఆసుపత్రిలోని ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ వార్డును సందర్శించి, అక్కడ మరో 10 మంది శిశువులకు బంగారు ఉంగరాలు అందించారు. వైద్యుల సమక్షంలో చిన్నారులతో, వారి తల్లిదండ్రులతో సరదాగా గడిపారు. అంతకుముందు ఉదయం 11 గంటలకు చెన్నై నుంచి మధురై విమానాశ్రయానికి చేరుకున్న సీఎం విజయ్‌కు పార్టీ కార్యకర్తలు, అభిమానులు వందలాదిగా తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. ఆయన కాన్వాయ్ ఆసుపత్రికి వెళ్లే దారి పొడవునా ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలు నిలబడి పూలవర్షం కురిపించారు. రాజాజీ ఆసుపత్రి వద్ద వాహనం దిగి, జనసందోహం మధ్య నడుచుకుంటూనే వేదిక వద్దకు చేరుకున్నారు. దారిలో ఆసుపత్రి సిబ్బంది, ప్రజలకు అభివాదం చేస్తూ, పలుచోట్ల ఆగి వారితో ఫొటోలు దిగారు. సీఎం రాకతో ఆసుపత్రి పరిసరాలు జనసంద్రంగా మారాయి.

# కాలుష్యంపై ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం..

## నవంబర్ 1 నుంచి కఠిన నిబంధనలు

- **ఢిల్లీలో వాయు కాలుష్య నియంత్రణకు ముందస్తు చర్యలు**
- **నవంబర్ 1 నుంచి రెట్టింపు కానున్న పార్కింగ్ ఛార్జీలు**
- **ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఆదేశాలు**
- **నిర్మాణ, కూల్చివేత పనులపై పూర్తిగా నిషేధం**
- **ఫిబ్రవరి 28 వరకు అమలులో ఉండనున్న నిబంధనలు**

ప్రతి ఏటా శీతాకాలంలో తీవ్ర వాయు కాలుష్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దేశ రాజధాని ఢిల్లీలో ప్రభుత్వం ముందస్తు నియంత్రణ చర్యలకు ఉపక్రమించింది. కాలుష్య తీవ్రతను తగ్గించే లక్ష్యంతో 2026 నవంబర్ 1వ తేదీ నుంచి కఠిన నిబంధనలను అమలు చేయనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా పార్కింగ్ ఛార్జీలను రెట్టింపు చేయడంతో పాటు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని తప్పనిసరి చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త నిబంధనల ప్రకారం, నవంబర్ 1 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు కేవలం 50 శాతం సిబ్బందితోనే కార్యకలాపాలు సాగించాలి. మిగిలిన 50 శాతం మంది ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ వెసులుబాటు కల్పించాలని స్పష్టం చేసింది. వీటితో పాటు, నగర వ్యాప్తంగా భవన నిర్మాణ, కూల్చివేత పనులపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిషేధం విధించింది. వాహనాల వినియోగాన్ని నియంత్రించేందుకు ఈ కాలంలో పార్కింగ్ ఫీజులను కూడా రెట్టింపు చేయనున్నట్లు వెల్లడించింది. శీతాకాలంలో ఉష్ణోగ్రతలు పడిపోవడం, పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హర్యానాలలో పంట వ్యర్థాలను కాల్చడం, వాహన కాలుష్యం, నిర్మాణ రంగ ధూళి, దీపావళి బాణసంచా, పారిశ్రామిక ఉద్గారాల వంటి కారణాలతో ఢిల్లీ నగరం ప్రతి ఏటా గ్యాస్ ఛాంబర్‌ను తలపిస్తోంది. దట్టమైన పొగమంచు కారణంగా ప్రజలు శ్వాసకోశ సమస్యలు బారిన పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ చర్యల ద్వారా శీతాకాలంలో కాలుష్య తీవ్రతను కొంతమేరకైనా తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు



మన దునియా
RNI Number
మన అక్షరం - మన ప్రపంచం



# సీసీ నస్పూర్ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

**లారీ--ఆటో ఢీ.. ముగ్గురు మహిళలు మృతి**

**ఘటనపై మంత్రి వివేక్ వెంకటస్వామి దిగ్భ్రాంతి**

**మృతుల కుటుంబాలకు వ్యక్తిగతంగా రూ.25 వేల చొప్పున, క్షతగాత్రులకు రూ.10 వేల చొప్పున తక్షణ సాయం ప్రకటించిన మంత్రి వివేక్ వెంకటస్వామి**

**మన దునియా,సెప్టెంబర్ 28, మంచిర్యాల జిల్లా**

మంచిర్యాల జిల్లా సీసీ నస్పూర్ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మహిళలు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. లారీ--ఆటో ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతులను మందమర్రి మండలానికి చెందిన మహిళలుగా గుర్తించారు.ప్రమాద ఘటనపై శక్తి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి స్పందించారు. ప్రమాదంలో ముగ్గురు మహిళలు మృతి చెందడంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. 25 వేల చొప్పున తక్షణ ఆర్థిక సాయం వ్యక్తిగతంగా అందించనున్నట్లు మంత్రి ప్రకటించారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురు




క్షతగాత్రులకు రూ. 10 వేల చొప్పున వ్యక్తిగతంగా ఆర్థిక సాయం అందిస్తానని తెలిపారు.ప్రమాదం జరిగిన వెంటనే మంత్రి మంచిర్యాల జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు కల్పించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు హైదరాబాద్ నుంచి స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

# శ్రీ దత్త సాయి సన్నిధిలో ఘనంగా షిరిడి సాయిబాబా 191 వ పుట్టినరోజు వేడుకలు

**మన దునియా (ఉమ్మడి గుంటూరు జిల్లా) సెప్టెంబర్ 28**

చిలకలూరిపేట ప్రముఖ ఆధ్యాత్మిక సామాజిక సేవా సంస్థ శ్రీ దత్త సాయి అన్నదాన సమాజం మరియు జయ జయ సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో వేంచేసి ఉన్న శ్రీ దత్త సాయి సన్నిధిలో ఈరోజు షిరిడి సాయిబాబా 191 వ పుట్టినరోజు సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగి ఉన్నాయి కార్యక్రమాల్లో భాగంగా సాయి చాలీసా పారాయణ కార్యక్రమం జరిగింది అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ కమిషనర్ శ్రీ హరిబాబు, పట్టణ ప్రముఖులు తేళ్ల సుబ్బారావు , ఏపీ సీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏల్చూరి ఏడుకొండలు , లీలావతి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ లావు సుష్మా గారు కార్యక్రమంలో పాల్గొని కేక్ కట్ చేసి బాబా కి ప్రత్యేక హారతి సమర్పించారు, అనంతరం భక్తులకు దాతల సహకారంతో అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు, బాబా జీవించిన విధానం వారు చేసిన ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు ఆదర్శంగా తీసుకొని ప్రజలందరూ మన గురువులకు రావాలని ప్రతి ఒక్కరికి గురు బలం అవసరమని ఆ గురువు బలం వల్ల సకలము సాధించు





# ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దేశవ్యాప్త నిరసనలు

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**ఎన్నికల ప్రక్రియపై కాంగ్రెస్ ఆందోళన**

**టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఆందోళన**

**మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 28**

ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరుతో దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతం కలుగుతోందని కాంగ్రెస్ పార్టీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఆందోళనలో షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై అనేక అనుమానాలు, అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఓటర్ల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉండేలా పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరుపై కాంగ్రెస్ పార్టీ పలు ప్రశ్నలు లేవనెత్తుతోందని, దేశవ్యాప్తంగా పార్టీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో నిరసనలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ కారణంగా బీహార్‌లో ఆర్జేడీ, పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ వంటి పార్టీలకు నష్టం జరిగిందనే ఆరోపణలు కాంగ్రెస్ నేతలు చేస్తున్నారని పేర్కొన్నారు.ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు అనుమానాలు తలెత్తకుండా ఎన్నికల సంఘం ప్రతి అంశంలో పారదర్శకంగా వ్యవహరించాలని శంకర్ కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హత ఉన్న ప్రతి పౌరుడి ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తుందని అన్నారు.బీఆర్‌కే భవన్ వద్ద టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, శ్రీధర్ మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సంఘం తీరుపై పలు ఆరోపణలు చేశారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ ఆందోళనలో షాద్‌నగర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపీపి శివ శంకర్ గౌడ్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు...



## చిలకలూరిపేట పురుషోత్తపట్నం అడ్డరోడ్డు వద్ద విషాద ఘటన

**మన దునియా (ఉమ్మడి గుంటూరు జిల్లా) సెప్టెంబర్ 28**



చిలకలూరిపేట అడ్డ రోడ్డు సెంటర్ లో తిరుపతి--రాజమండ్రి ఆర్టీసీ బస్సు బార్‌గేట్స్ వద్ద స్లో అవుతున్న సమయంలో ప్రమాదం బస్సు నెమ్మదిస్తున్న సమయంలో ఓ ప్రయాణికుడు దిగుతుండగా, బస్సు కదులుతున్న క్రమంలో బార్ గేట్ వద్ద ఉన్న గుర్తు తెలియని వ్యక్తి వెనుక టైరు కింద పడి మృతి చెందినట్లు డ్రైవర్ చెబుతున్నారు.బస్సు డ్రైవర్ తెలిపిన వివరాల ప్రకారం ఘటన జరిగినట్లు సమాచారం ప్రమాదానికి అసలు కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## కృష్ణా-గుంటూరు టీచర్స్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభం

**మన దునియా(ఉమ్మడి గుంటూరు జిల్లా) సెప్టెంబర్ 28**



చిలకలూరిపేట:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు కృష్ణా-గుంటూరు ఉపాధ్యాయ నియోజకవర్గ నూతన (డి-నోవో) ఓటరు జాబితా తయారీ ప్రక్రియ సెప్టెంబర్ 28, 2026 నుండి ప్రారంభమైందని చిలకలూరిపేట పురపాలక సంఘం కమీషనర్ పి శ్రీహరి బాబు ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవడానికి ఫారం-19 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులు గత ఆరు సంవత్సరాల కాలంలో మూడు సంవత్సరాలకు మించి ఉపాధ్యాయ వృత్తిలో పనిచేసినట్లుగా, సంబంధిత విద్యాసంస్థ ప్రధానోపాధ్యాయుడు లేదా కరస్పాండెంట్ జారీ చేసిన ధృవీకరణ పత్రాన్ని జతచేసి సమర్పించవలసి ఉంటుంది. ఫారం-19 దరఖాస్తుల స్వీకరణకు నవంబర్ 6, 2026 ను చివరి తేదీగా నిర్ణయించారు. కావున అర్హులైన ఉపాధ్యాయులు ఈ నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్ ద్వారా కానీ, లేదా చిలకలూరిపేట పురపాలక సంఘ కార్యాలయంలో కానీ తమ దరఖాస్తులను సమర్పించుకోవాలని కమీషనర్ పి శ్రీహరి బాబు కోరారు.

## ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి: మాజీ మంత్రి హరీశ్ రావు

**మన దునియా,సిద్దిపేట:సెప్టెంబర్ 28**




సిద్దిపేట : పోలీసు ఉద్యోగాల కోసం సిద్దిపేటలో నిరుద్యోగ యువత కోసం ఏర్పాటు చేసిన 'కేసీఆర్ ఉచిత కోచింగ్ సెంటర్' శిక్షణా శిబిరానికి సార్థకత చేకూరాలంటే విద్యార్థులందరూ పట్టుదలతో చదివి ఉద్యోగాలు సాధించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు.బీపేద విద్యార్థులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే తాను ఫీజు భరిస్తున్నానని, రాబోయే నవంబర్ 29 వరకు అర్జునుడికి పక్షి కన్నులా కేవలం లక్ష్యమే కనిపించాలని సూచించారు.ఈ ఆరు నెలల పాటు సోషల్ మీడియా, రీల్స్, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండి కేవలం చదువుపైనే పూర్తిగా దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. గడిచిన 12 ఏండ్లుగా తాను అందిస్తున్న ఈ ఉచిత కోచింగ్ ద్వారా ఎంతో మంది పేద పిల్లలు గ్రూప్స్, పోలీస్ తదితర ఉద్యోగాలు సాధించి తనను కలవడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాల హామీలపై ఆయన విమర్శలు గుప్పించారు.

సమాజ బాధ్యతలను బోధించాలి

సిద్దిపేటలో తెలంగాణ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (టీపీఎస్ఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవంలో హరీశ్‌రావు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు కేవలం మార్కులు, ర్యాంకులే కాకుండా సమాజం పట్ల మంచి బాధ్యతలను నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు. మంచి సమాజ నిర్మాణం గురువుల ద్వారానే సాధ్యమని, మనం ఏ ఉన్నత స్థాయికి చేరినా ఉపాధ్యాయులు అందించిన విద్యాబుద్ధులే కారణమని గుర్తుచేశారు.విద్యార్థులు సెల్ ఫోన్ల వాడకం తగ్గించి, పుస్తక పఠనాన్ని అలవర్చుకోవడం ద్వారా జీవిత పాఠాలు నేర్చుకోవచ్చని తెలిపారు. చిన్న ఒత్తిడికే లోనై విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం బాధాకరమని, వారిలో నైతిక స్థైర్యం నింపాలని సూచించారు. అంతకుముందు కొండా లక్ష్మణ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు

## హోటళ్లలో అక్రమ కలప నిల్వలపై అటవీశాఖ

**జిల్లా ఫారెస్ట్ అధికారి సునీత ఆధ్వర్యంలో పలు హోటళ్లలో తనిఖీలు**

**ఉమ్మడి, నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మన దునియా:**



కామారెడ్డిజిల్లా బాన్సువాడ పట్టణంలోని పలు హోటళ్లలో అక్రమంగా కలప నిల్వ చేసినట్లు వచ్చిన సమాచారం నేపథ్యంలో జిల్లా ఫారెస్ట్ అధికారి సునీత ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. హోటళ్లలో కలప నిల్వలు, వాటికి సంబంధించిన అనుమతులు, ఇతర వివరాలను పరిశీలించారు. తనిఖీల్లో కలప నిల్వలకు సంబంధించి నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే అంశంపై అధికారులు ఆరా తీశారు. అటవీశాఖ నిబంధనలకు విరుద్ధంగా కలప నిల్వ చేసినట్లు గుర్తిస్తే సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారీ హబీబ్, ఫారెస్ట్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## కిడ్నాప్ మరియు పోక్సో కేసులో నిందితుడికి 20 సంవత్సరాల శిక్ష

**మన దునియా,సిద్దిపేట్: సెప్టెంబర్ 28**



సిద్దిపేట్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన బాలికను కిడ్నాప్ మరియు పోక్సో కేసులోని నిందితుడు కొమ్ముగళ్ల బాలకృష్ణ(35) అనే వ్యక్తికి న్యాయస్థానం 20 సంవత్సరాల జైలు శిక్ష తో పాటు 1,05,000 జరిమానా విధిస్తూ న్యాయస్థానం న్యాయమూర్తి వై. జయప్రసాద్ తీర్పు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో 27/01/2018న కేసు నమోదు చేశారు ఈ కేసులో దర్యాప్తు అధికారి అప్పటి ఇన్స్పెక్టర్ నందీశ్వర్ రెడ్డి సమగ్ర దర్యాప్తు నిర్వహించి, పూర్తి సాక్ష్యాధారాలను సేకరించి పటిష్టమైన ఛార్జిషీట్‌ను న్యాయస్థానంలో దాఖలు చేశారు విచారణ సందర్భంగా లిప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాదుల ఆత్మారాములు వాదనలు వినిపించగా, ప్రస్తుత ఇన్స్పెక్టర్ పి. మహేందర్ రెడ్డి , సాక్షాలు నమోదు చేసిన ఇన్స్పెక్టర్ వాసుదేవరావు, లైజనింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి , సీడీఓ బాపురెడ్డి, భరోసా ఇన్చార్జ్ అధికారి ఇన్స్పెక్టర్ బి.దుర్గా, భరోసా లీగల్ అధికారి సౌమ్య, భరోసా సిబ్బంది సమన్వయంతో కేసు విచారణలో సహకారం అందించారని పేర్కొన్నారు.సమర్పించిన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలు మరియు ఇతర ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం న్యాయమూర్తి వై. జయ ప్రసాద్ నిందితుడిని దోషిగా నిర్ధారించి 20 సంవత్సరాల శిక్షతో పాటు 1,05,000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన అధికారులను, సిబ్బందిని సిద్దిపేట సిపి రష్మీ పెరుమాళ్, అభినందించారు. సమాజంలో మహిళల భద్రతకు తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని, నేరస్థులకు శిక్ష పడేలా చేయడంలో రాజీ పడబోమని ఈ సందర్భంగా సిపి స్పష్టం చేశారు.

**యుపీఐ చెల్లింపులపై కొత్తగా తీసుకొచ్చిన మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధానానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈరోజు విచారణ చేపట్టనుంది.**

**మన దునియా,న్యూఢిల్లీ:సెప్టెంబర్ 28**



రూ.2 వేలు దాటిన కొన్ని యూపీఐ 'పర్సన్ టు మర్చంట్' (పీ2ఎం) లావాదేవీలపై చార్జీలు విధించేందుకు కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఈ పిటిషన్ దాఖలైంది.న్యాయవాది అంజన్ దత్తా ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించనుంది. జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనా ఈ బెంచ్‌లో సభ్యులుగా ఉన్నారు.కొత్త విధానం అమల్లోకి వస్తే రూ.2,000కు మించిన నిర్దిష్ట యూపీఐ పీ2ఎం లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ విధిస్తారు. రూ.75,000, అంతకంటే ఎక్కువ విలువైన లావాదేవీలకు ఈ చార్జీ గరిష్ఠంగా రూ.300కు పరిమితం చేస్తారు. అయితే వ్యక్తి నుంచి వ్యక్తికి చేసే యూపీఐ చెల్లింపులు (పీ2పీ) ఎంత మొత్తమైనా ఉచితంగానే కొనసాగుతాయి. రూ.2,000 వరకు మర్చంట్ చెల్లింపులపైనా ఎండీఆర్ ఉండదు. కొన్ని ప్రత్యేక రంగాలకు వేరే రేట్లు నిర్ణయించారు. రైల్వేలు, టెలికాం, బీమా, ఇంధనం, వ్యవసాయ ఇన్‌పుట్స్ వంటి రంగాల్లో రూ.2,000కు మించిన లావాదేవీలపై ఒక్కో లావాదేవీకి రూ.5 చొప్పున ఎండీఆర్ ఉంటుంది. మ్యూచువల్ ఫండ్లు, సెక్యూరిటీస్, స్టాక్‌బ్రోకర్లు, డీలర్లకు సంబంధించిన లావాదేవీలపై 0.02 శాతం ఎండీఆర్ విధిస్తారు. దీనికీ రూ.300 గరిష్ఠ పరిమితి ఉంటుంది.

పిటిషన్‌లో ఏం అభ్యంతరం?

కేంద్రం సెప్టెంబర్ 14న జారీ చేసిన నోటిఫికేషన్, సెప్టెంబర్ 15న ప్రకటించిన ఎండీఆర్ విధానాన్ని అంజన్ దత్తా సవాలు చేశారు. తగిన చట్టపరమైన రక్షణలు, పారదర్శకత, ప్రజా సంప్రదింపులు లేకుండానే ఈ విధానాన్ని తీసుకొచ్చారని పిటిషన్‌లో పేర్కొన్నారు. అలాగే పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్, 2007లోని సెక్షన్ 10ఏ సవరణ రాజ్యాంగబద్ధతను కూడా ప్రశ్నించారు.

## చౌటుప్పల్ వద్ద భారీ ట్రాఫిక్ జామ్

- **10 కిలోమీటర్ల మేర నిలిచిపోయిన వాహనాలు.. తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు**

**మన దునియా,చౌటుప్పల్:సెప్టెంబర్ 28**

విజయవాడ--హైదరాబాద్ జాతీయ రహదారిపై చౌటుప్పల్--యల్లగిరి ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సుమారు 10 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.రహదారిపై వాహనాల రద్దీ ఒక్కసారిగా పెరగడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. దీంతో అత్యవసర ప్రయాణాలు చేసే వారు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ట్రాఫిక్ జామ్‌ను నియంత్రించేందుకు అధికారులు, పోలీసులు తక్షణ చర్యలు చేపట్టి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని వాహనదారులు కోరుతున్నారు. ట్రాఫిక్ క్లియర్ అయ్యే వరకు వాహనదారులు సహనంతో ప్రయాణించాలని, ప్రత్యామ్నాయ మార్గాలను వీలైతే వినియోగించాలని సూచిస్తున్నారు.



## మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించిన బీజేపీ కార్పొరేటర్లు..









**ప్రజా సమస్యలను పరిష్కరించాలని బీజేపీ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు.**

**సోమవారం ఉదయం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించారు.**

**ధర్నా చౌక్ వద్ద నిరసన..**

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**

నగరం నిజామాబాద్ లోని 60 డివిజన్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి డివిజన్లో సమస్యలు ఒక్కటి కూడా పరిష్కారం కావట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కార్పొరేటర్లు ఒక్కసారిగా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వారిని నిలువరించారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయిస్తామని వారు నినాదాలు చేశారు.

## కృష్ణజింకను వేటాడి మాంసంతో పట్టుబడ్డ తొమ్మిది మంది





- **షాద్‌నగర్‌లో పోలీస్, ఎస్‌వోటీ, అటవీశాఖ అధికారుల సంయుక్త ఆపరేషన్**
- **మీడియా సమావేశంలో షాద్‌నగర్ డిసిపి శిరీష రాఘవేందర్ వెల్లడి**

**మన దునియా,షాద్‌నగర్: సెప్టెంబర్ 28**

కృష్ణజింకను వేటాడి, దాని మాంసాన్ని ముక్కలుగా నరికి నగరానికి తరలిస్తున్న తొమ్మిది మంది ముఠాను షాద్‌నగర్ పోలీసులు, ఎస్‌వోటీ, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి లైసెన్స్‌డ్ తుపాకీ, బుల్లెట్లు, కృష్ణజింక మాంసం, రెండు వాహనాలు, నగదు, సెల్‌ఫోన్లు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు.రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ డీసీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో డీసీపీ శిరీష రాఘవేంద్ర వివరాలు వెల్లడించారు. అధికారుల వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 26న అర్ధరాత్రి హైదరాబాద్‌కు చెందిన తొమ్మిది మంది వ్యక్తులు కార్లలో నారాయణపేట జిల్లా మరికల్ అటవీ ప్రాంతానికి వెళ్లారు. సెప్టెంబర్ 27న ఉదయం లైసెన్స్‌డ్ తుపాకీతో కృష్ణజింకను వేటాడి చంపిన అనంతరం దాని మాంసాన్ని ముక్కలుగా నరికి ప్యాక్ చేసుకుని హైదరాబాద్ వైపు బయలుదేరినట్లు పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు రాయకల్ టోల్‌ప్లాజా సమీపంలో పోలీసులు తనిఖీలు చేపట్టగా నిందితుల ముఠా పట్టుబడింది. విచారణలో కృష్ణజింకను తామే వేటాడినట్లు నిందితులు వెల్లడించినట్లు అధికారులు తెలిపారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో ఎం.డి. హాజీ ఉద్దీన్ (36), మీర్ ముక్తార్ అలీ (37), ఎం.డి. తాజుముల్ (37), మీర్ రాజా అలీ ఖాన్ (39), ఖుర్రం ఖాన్ (35), సయ్యద్ సల్మాన్ అలీ (30), ఎం.డి. అఫ్రోజ్ ఖాన్ (36), ఎం.డి. అబ్దుల్ అజీజ్ (33), ఎం.డి. రియాజ్ (28) ఉన్నారు.నిందితుల నుంచి .315 రైఫిల్, టెలిస్కోప్, సైలెన్సర్, 19 బుల్లెట్లు, సుమారు 13 కిలోల కృష్ణజింక మాంసం, నల్లటి స్కార్పియో వాహనం, సుజుకి ఎస్-క్రాస్ వాహనం, ఎనిమిది స్మార్ట్‌ఫోన్లు, రూ.28,590 నగదు, రెండు టార్చ్‌లైట్లు, క్యానన్ కెమెరాను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972లోని 9, 39, 50, 51, 57 సెక్షన్లతో పాటు ఆర్మ్స్ యాక్ట్ సెక్షన్ 30 కింద కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. వన్య ప్రాణులను వేటాడటం, చంపడం, వాటి మాంసాన్ని అక్రమంగా తరలించడం లేదా విక్రయించడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని డీసీపీ శిరీష రాఘవేంద్ర హెచ్చరించారు. అక్రమ వేటకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వన్యప్రాణుల అక్రమ వేటకు సంబంధించిన సమాచారం తెలిస్తే అటవీశాఖ టోల్‌ఫ్రీ నంబర్లు 1800-425-5364, 040-23231440కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.మీడియా సమావేశంలో ఏసీపీ లక్ష్మీనారాయణ, పట్టణ సీఐ సీతారాం, ఎస్‌వోటీ పోలీసులు, అటవీశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు..

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# అరవింద్ అంటేనే హాఫ్ నాలెడ్జి





- అహంకారం, అవినీతి, అబద్దానికి ఆంగి లాగు తొడిగితే అది అరవింద్
- అయ్యపేరు చెప్పుకుని 2004 లో కాంగ్రెస్ బీ ఫామ్ లు అమ్ము కున్నాడు
- రేవంత్ రెడ్డిని పగలు తిడతాడు, రాత్రి పోయి పొర్లు దండలు పెడతడు
- అరవింద్ ఎంపీ గా గెలవడం నిజామాబాద్ జిల్లా దురదృష్టం
- బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:, సెప్టెంబర్ 28:-**

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అంటేనే హాఫ్ నాలెడ్జి గాడని – బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి ధ్వజమెత్తారు. నిజామాబాద్ నగరంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అహంకారం, అవినీతి, అబద్దానికి ఆంగి లాగు తొడిగితే అది అరవింద్ అసలు రూపమని ఎద్దేవా చేశారు.అయ్యపేరు చెప్పుకుని 2004 లో కాంగ్రెస్ బీ ఫామ్ లు అమ్ము కున్న అవినీతి బాగోతాలు అరవింద్ మూటగట్టు కున్నాడని ఆయన అన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని పగలు పొట్టోడు అని తిడతాడు, రాత్రి పోయి పొర్లు దండలు పెడతడు అని ఆయన వ్యాఖ్యానించారు.అరవింద్ ఎంపీ గా గెలవడం నిజామాబాద్ జిల్లా దురదృష్ట మన్నారు.బనకచర్లను జనకచర్ల అనే అరజ్ఞాని అరవింద్ అని, నిజామాబాద్ కు నయాపైసా తేలేని చేతకాని దద్దమ్మ అని, అలాంటి చవట సన్నాసి అరవింద్ కు రాష్ట్రం తెచ్చిన కేసీఆర్ గురించి మాట్లాడే స్థాయి ఉందా? అని జీవన్ రెడ్డి నిప్పులు చెరిగారు. రేవంత్ పేటీఎం బ్యాచ్ సభ్యుడు అరవింద్ అని,కాంగ్రెస్ తో పోరాడే శక్తి లేక కేసీఆర్ ను తిడుతుండు అని ఆయన ఎద్దేవా చేశారు.తెలంగాణ ఉద్యమం లో అరవింద్ పాత్ర అణా పైసా కూడా లేదన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టు పై ఇంకెంత కాలం విషం కక్కుతారని ప్రశ్నించారు.చిల్లర రాజకీయాలకు, రోత మాటలకు అరవింద్ అడ్డాగా మారిండని ఆయన విమర్శించారు.అరవింద్ ఇల్లు, అతడి కుటుంబమే అవినీతి, అబద్దాల పునాదులపై పుట్టిందన్నారు.నీ అయ్య కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు అవినీతికి బ్రాండ్ అంబాసిడర్ అని,

నువ్వే ఒక చార్లెస్ శోభరాజ్ వి, నీ పార్టీకి చెందిన ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఒక దావూద్ ఇబ్రహీం అని జీవన్ రెడ్డి మండిపడ్డారు.అరవింద్ ఒక డ్రగ్స్ స్మగ్లర్ అని, రాకేష్ రెడ్డి ఒక ఎర్ర చందనం, దొంగ బంగారం స్మగ్లర్ అని ఆయన ఎద్దేవా చేశారు.అరవింద్ కాదు రాబంధు అని, అతడి ఇంటి పేరు ధర్మపురి కాదు, ధర్మానికి ఉరి అని, అధర్మానికి పుట్టిన అడ్డగాడిద అని జీవన్ రెడ్డి ధ్వజమెత్తారు.పసుపు బోర్డు ఎక్కడుందో అరవింద్ చెప్పాలి. అరవింద్ రైతు ద్రోహి.ధర్మపురి కుటుంబమే పెద్ద యమపురి అని ఆయన అన్నారు.తెలంగాణ ఉద్యమంలో అరవింద్ కుటుంబం ఎక్కడుందని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి మౌత్ స్పీకర్ గా అరవింద్ మారాడని ఆయన పేర్కొంటూ కేసీఆర్ ఫ్యామిలీని విమర్శించే స్థాయా నీది? అని మండిపడ్డారు.కేసీఆర్ ది ఉద్యమ కుటుంబం, అరవింద్ ది అవినీతి ఫ్యామిలీ అని,అన్నం పెట్టిన కేసీఆర్ చేతికే సున్నం పెట్టిన నీతిమాలిన కుటుంబం అరవింద్ దని ఆయన ఎద్దేవా చేశారు.కేసీఆర్ భూములపై సీఎం రేవంత్ రెడ్డి ఏ అబద్ధాలు చెప్పిండో అవే అబద్ధాలు అరవింద్ కూడా చెప్పిండన్నారు.రేవంత్ రెడ్డి, బండి సంజయ్, అరగుండు అరవింద్ లు తెలంగాణ వాదులు కాదు అని,తెలంగాణ రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్న అంటు వ్యాధులు అని జీవన్ రెడ్డి ఎద్దేవా చేశారు.కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు కాలిగోటికి సరిపోని సన్నాసి అరవింద్ అని ఆయన అన్నారు.“బేవకూఫ్, బేకార్, భట్టేబాజ్, అరగుండు, చెత్త సన్నాసి, సైకో, శాడిస్ట్, డ్రగ్స్ అడిక్ట్, అన్నీ ఈ అబద్ధాల, అవినీతి అరవిందేనని అయన నిప్పులు చెరిగారు. కేసీఆర్ ఫ్యామిలీ జోలికొస్తే నాలుక చీరేస్తాం అని జీవన్ రెడ్డి హెచ్చరించారు.నిజామాబాద్ జిల్లాలో పసుపు రైతులను నిలువునా ముంచిన ద్రోహి అరవింద్ అని,బీజేపీ , కాంగ్రెస్ ల ఓట్ల రాజకీయాలతో పసుపు రైతులు పరేషాన్ అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.పసుపు రైతులకు కాంగ్రెస్ కుచ్చు టోపీ పెట్టీ రచ్చకీడ్చిందని,బీజేపీ బేకార్ మాటలతో బజారుకీడ్చిందని ఆయన అన్నారు.పసుపు పండేది గల్లీలో, పసుపుఇం బోర్డు డిల్లీలో అని ఆయన పేర్కొంటూ నయాపైసా నిధులు, ఆఫీసుకు గదులు లేని పసుపు బోర్డు నిజామాబాద్ లో ఎక్కడుందని నిలదీశారు.బట్టేబాజ్ మాటలు చెప్పి బాండ్ పేపర్ రాసిచ్చి రెండు సార్లు ఓట్లు వేయించుకున్న ఎంపీ అరవిందు పసుపు రైతుల బాధలు ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. పసుపుకు మద్దతు ధరలు కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ ఎందుకు రైతులకు అండగా నిలవడం లేదన్నారు.నోటి దురద మాటలతో కేసీఆర్ ఫ్యామిలీపై విషం కక్కుతున్న అరవింద్ భరతం పట్టడానికి గులాబీ సైన్యం సిద్ధంగా ఉందని జీవన్ రెడ్డి హెచ్చరించారుఈ కార్యక్రమంలో మాజీ జడ్పి ఛైర్మన్ విఠల్ రావు,సత్యప్రకాష్,లక్ష్మారెడ్డి,కౌన్సిలర్లు నదీమ్,పృథ్వి, అజీమ్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు గంగాధర్,రంజిత్,అభిలాష్,మల్లారెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ ఆశయ సాధనకై యువత ఉద్యమించాలి.

**మతోన్మాద, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా యువత ఉద్యమించాలి**

**ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్**

**మన దునియా,కరీంనగర్ జిల్లా:సెప్టెంబర్ 28**

భారతదేశ స్వాతంత్ర్య సమరయోధులు షహీద్ భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో మతోన్మాద, సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా అసమానతలు లేని సమాజ నిర్మాణానికి యువత ముందుకు సాగుతూ ఉద్యమించాలని, భగత్ సింగ్ ఆశయాలు నేటి యువతరం ముందుకు తీసుకెళ్లి ఉద్యమించాలని యుగంధర్అన్నారు. భగత్ సింగ్ 119వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఏఐవైఎఫ్ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో బోయవాడలో గల భగత్ సింగ్ విగ్రహానికి ఏఐవైఎఫ్ నాయకులు పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ సామ్రాజ్య వాదులకు వ్యతిరేకంగా పోరాడి, దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేస్తూ బ్రిటిషర్ల ఉరికంబాన్ని ముద్దాడి అమరత్వం పొందిన విప్లవ ధృవతార షహిద్ భగత్ సింగ్ అని కొనియాడారు. వారి పోరాట స్ఫూర్తితో నేటి సమాజంలో అసమానతలపై, అందరికీ సమాన హక్కులకై, మతోన్మాదంపై, సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా, దోపిడి, పీడన, అణిచివేత, కులమత లేని సమ సమాజ స్థాపనకై పోరాడుతూ అసమానతలు లేని సమాజ నిర్మాణానికి ముందుకు సాగుతూ యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కసిబోసుల సంతోష్ చారి, ఉపాధ్యక్షులు కాల్వ శ్రీనివాస్ యాదవ్, పినమల్ల విజయభాస్కర్, నగర సహాయ కార్యదర్శి జువ్వాజితిరుపతి, జహీర్ ఖాన్,వర్ధన్, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.



## ఫేస్‌బుక్‌లో మహిళతో పరిచయం... పరిచయం కాస్త లావాదేవీల దాకా...పెట్టింది కుచ్చుటోపీ... రూ.14.61 కోట్లు పోగొట్టుకున్న హైదరాబాద్ డాక్టర్!

- హైదరాబాద్ వైద్యుడిని మోసం చేసిన ఫేస్‌బుక్ స్నేహితురాలు
- నకిలీ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లో పెట్టుబడి పేరుతో భారీ మోసం
- విడతలవారీగా రూ.14.61 కోట్లు బదిలీ చేయించుకున్న సైబర్ నేరగాళ్లు
- విత్‌డ్రాకు ప్రయత్నించగా ట్యాక్స్ పేరుతో మరో రూ.7.5 కోట్లు డిమాండ్
- తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో దర్యాప్తు, 40 ఖాతాలకు డబ్బు మళ్లింపు

**మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 28**




హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ప్రాంతానికి చెందిన 44 ఏళ్ల దంత వైద్యుడికి ఆగస్టు 27న ఫేస్‌బుక్ మెసెంజర్‌లో 'మోనికా మాధవ్' అనే పేరుతో ఒక మహిళ పరిచయమైంది. తాను చెన్నైకి చెందిన దానినని, విడాకుల ప్రక్రియలో ఉన్నానంటూ సానుభూతి పొందింది. ఆ తర్వాత తనను టెలిగ్రామ్‌లో సంప్రదించాలని కోరి, తాను ట్రేడింగ్ ద్వారా రోజూ రూ.4–5 లక్షలు సంపాదిస్తున్నట్లు నమ్మబలికింది. ఆమె మాటలు నమ్మిన వైద్యుడితో cmcmarketsltd.com అనే నకిలీ ట్రేడింగ్ వెబ్‌సైట్‌లో ఖాతా తెరిపించి, ఆధార్ వివరాలు అప్‌లోడ్ చేయించింది. నమ్మకం కుదిర్చేందుకు, సెప్టెంబర్ 3న వైద్యుడు పెట్టిన రూ.30 లక్షల పెట్టుబడికి రూ.8.6 లక్షలు లాభం వచ్చినట్లు సైట్‌లో చూపించారు. అందులో నుంచి రూ.85,000 విత్‌డ్రా చేసుకునేందుకు కూడా అనుమతించడంతో అతనికి అనుమానం రాలేదు. ఇదే అదనుగా, ఇద్దరం కలిసి రూ.10 కోట్లు పెట్టుబడి పెడదామని ఆమె ప్రతిపాదించింది. దీంతో వైద్యుడు తన వద్ద ఉన్న డబ్బుతో పాటు, అప్పులు చేసి విడతల వారీగా మొత్తం రూ.14.51 కోట్లు డిపాజిట్ చేశాడు. ఆయన ఖాతాలో మొత్తం లాభం రూ.34 కోట్లు ఉన్నట్లు సైట్‌లో కనిపించింది. ఆ డబ్బును విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా, ఆప్షన్ పనిచేయలేదు. డబ్బు రావాలంటే పన్నుల కింద రూ.7.5 కోట్లు చెల్లించాలని సైబర్ కేటుగాళ్లు డిమాండ్ చేశారు. అదే సమయంలో మోనికా తన కాంటాక్ట్‌లను బ్లాక్ చేసి అదృశ్యమవడంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటనపై ఐటీ చట్టంలోని సెక్షన్ 66–డీతో పాటు భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. బాధితుడు 91 సార్లు డబ్బు బదిలీ చేసినట్లు, ఆ మొత్తం 10 రాష్ట్రాల్లోని 40 బ్యాంకు ఖాతాలకు మళ్లినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. టీజీసీఎస్‌బీ అధికారులు ఈ కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

## పాత కక్షలు.. వ్యక్తిని కత్తితో పొడిచి హత్య

**మన దునియా,కరీంనగర్:సెప్టెంబర్ 28**



కరీంనగర్: పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన హుజూరాబాద్ మండలంలో చోటుచేసుకుంది. పెద్దపాపయ్యపల్లిలో ఉప్పలపల్లికి చెందిన రాకేశ్‌పై ప్రశాంత్ అనే వ్యక్తి కత్తితో దాడి చేసినట్లు సమాచారం.ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన రాకేశ్ అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలుస్తోంది. పాత కక్షలే హత్యకు కారణమై ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.హత్య అనంతరం నిందితుడు ప్రశాంత్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయినట్లు సమాచారం. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

## ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం -- ప్రజాదివాస్‌లో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్.

**మన దునియా,భూపాలపల్లి జిల్లా:సెప్టెంబర్ 28**

భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి మొత్తం 15 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును ఎస్పీ శ్రద్ధగా విని, సంబంధిత పోలీస్ స్టేషన్ సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి, సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి పైరవీలు లేదా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, ప్రజలకు మరింత చేరువగా ఉండి శాంతి భద్రతలను పరిరక్షించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని తెలిపారు.ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు సత్వర, పారదర్శకమైన సేవలు అందించేందుకు భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు.



మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

# రూ.3,295 కోట్లతో రేడియల్ రోడ్డు-2

**ఓఆర్ఆర్ వద్ద బుద్వేల్ నుంచి ఎన్‌హెచ్ 167పై ఉన్న నాచారం వరకు నిర్మాణం**

**మూడు ప్యాకేజీల్లో పనులు.. 18నెలల గడువు**

**రంగారెడ్డి జిల్లాలోని పశ్చిమం వైపు..**

**వికారాబాద్, నారాయణపేట జిల్లాల అభివృద్ధికి రాచమార్గం**

**శంషాబాద్, షాబాద్, కొందుర్గు, పూడురు, పరిగి మండలాల పరిధిలోని దాదాపు 26 గ్రామాల వెంట రేడియల్ రోడ్డు-2**

**మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 28**




హైదరాబాద్ నగరంలోకి రాకుండానే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల మధ్య ప్రయాణించేలా.. ఓఆర్ఆర్ నుంచి రీజనల్ రింగ్‌రోడ్డుకు అనుసంధానంగా నిర్మించ తలపెట్టిన రేడియల్ రోడ్లలో రెండో రోడ్డుపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. ఔటర్ రింగ్ రోడ్డుపై బుద్వేల్ నుంచి ఎన్‌హెచ్ 167లోని నాచారం వరకు రేడియల్ రోడ్డు-2 పనులను వేగవంతం చేసింది. సుమారు 81 కిలోమీటర్ల పొడవునా రూ.3,295 కోట్లతో దీనిని నిర్మించనున్నారు. ఇప్పటికే హెచ్ఎండీఏ పరిధిలోని హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) ఆధ్వర్యంలో టెండర్లను ఆహ్వానించారు. తాజాగా నిర్వహించిన ప్రీబిడ్ సమావేశంలో కాంట్రాక్టర్ల సందేహాలను నివృత్తి చేశారు. ఈ రోడ్డు రంగారెడ్డి జిల్లాలోని పశ్చిమం వైపు, వికారాబాద్, నారాయణపేట జిల్లాల అభివృద్ధికి రాచమార్గం కానుంది. ఈ రోడ్డే భవిష్యత్తులో పారిశ్రామిక కారిడార్‌గా మారే అవకాశాలు ఉన్నాయి.

మూడు ప్యాకేజీలు.. 18 నెలల గడువు

శంషాబాద్, షాబాద్, కొందుర్గు, పూడురు, పరిగి మండలాల పరిధిలోని దాదాపు 26 గ్రామాల వెంట రేడియల్ రోడ్డు-2 నిర్మాణానికి ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చారు. మూడు ప్యాకేజీలలో 18 నెలల్లో ఈ రోడ్డును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్యాకేజీ-1లో బుద్వేల్ నుంచి షాబాద్ వరకు 29.50 కిలోమీటర్లు, ప్యాకేజీ-2లో షాబాద్ నుంచి గూడురు వరకు 27 కిలోమీటర్లు, ప్యాకేజీ-3లో గూడూరు నుంచి ఎన్‌హెచ్ 167పై ఉన్న నాచారం వరకు 24.65 కిలోమీటర్ల మేర రోడ్డు ఉన్నాయి. 75 మీటర్ల వెడల్పుతో నాలుగు లేన్లతో ఈ రోడ్డును నిర్మించనున్నారు. ఈ మేరకు అవసరమైన భూసేకరణ కోసం రంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట జిల్లాల అధికారులు చర్యలు చేపట్టనున్నారు..

# చిలకలూరిపేటలో సేవా సంకల్ప్ అభియాన్-2026 సందడి.. చిన్నారుల ప్రతిభకు వేదిక

**ప్రధాని మోదీ జన్మదినోత్సవం సందర్భంగా చిత్రలేఖన పోటీలు - విజేతలకు నగదు బహుమతులు**

**మన దునియా (ఉమ్మడి గుంటూరు జిల్లా) సెప్టెంబర్ 28**






చిలకలూరిపేట: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు చేపట్టిన సేవా సంకల్ప్ అభియాన్-2026 లో భాగంగా పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలంలో చిత్రలేఖన, వక్తృత్వ పోటీలు ఘనంగా జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 22 నుండి 30 వరకు నిర్వహిస్తున్న ఈ పోటీల లక్ష్యం 25 కోట్ల భారతీయ చిన్నారుల కలలను ఆవిష్కరించడం.

ఇందులో భాగంగా చిలకలూరిపేటలో రెండు చోట్ల పోటీలు నిర్వహించారు.

1. శ్రీ చైతన్య స్కూల్, ఎన్టీఆర్ కాలనీలో...

ఇక్కడ నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ కె. శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ బి. మహేష్ బాబు, ప్రైమరీ కోఆర్డినేటర్ దీపిక, అకడమిక్ డీన్ రాము, ప్రీ-ప్రైమరీ ఇన్‌ఛార్జ్ రాధిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నాగభైరువారిపాలెం గ్రామ పరిధిలో కోడిపందాలపై పోలీసుల దాడి

**పొలాల్లో డబ్బులు పందెంగా పెట్టి కోడిపందాలు నిర్వహిస్తున్న 11 మంది అరెస్ట్.**

**మన దునియా (ఉమ్మడి గుంటూరు జిల్లా) సెప్టెంబర్ 28**



చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ జి. అనిల్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసుల దాడి.నిందితుల వద్ద నుంచి రూ.24,300 నగదు స్వాధీనం.ఒక కోడిపుంజు స్వాధీనం. రెండు బైకులు, 9 సెల్‌ఫోన్లు పోలీసుల స్వాధీనం. నిందితులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు.చిలకలూరిపేట మండల పరిధిలో కోడిపందాలు, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిక.అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పోలీసుల సూచన.

# ఎస్.ఆర్. ఆర్. తోట.లో భగత్ సింగ్ విగ్రహానికి పూలదండ వేసిన-రామ రాజేష్ ఖన్నా

**అమరవీరుడు భగత్ సింగ్ జయంతి సందర్భంగా నివాళులర్పించిన 32వ డివిజన్ స్థానికులు**

**మన దునియా,వరంగల్ జిల్లా:సెప్టెంబర్ 28**




నేడు విప్లవ వీరుడు, భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో చిరస్మరణీయుడు భగత్ సింగ్ జన్మదినం సందర్భంగా జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది.ఈ సందర్భంగా రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ... చిన్న వయస్సులోనే దేశం కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన మహా నాయకుడు భగత్ సింగ్ అని కొనియాడారు.

భగత్ సింగ్ చేసిన వీరోచిత పోరాటాలు:

చిన్నతనంలోనే దేశభక్తి: జలియన్ వాలాబాగ్ ఉదంతం ఆయన మనసును తీవ్రంగా కలిచివేసి, దేశవిముక్తి కోసం పోరాడాలనే దృఢ సంకల్పాన్ని నింపింది.

సైద్ధాంతిక పోరాటం: శాంతియుత పోరాటాలతో పాటు, ఆంగ్లేయుల నిరంకుశత్వానికి తగిన బుద్ధి చెప్పడానికి 'నౌజవాన్ భారత్ సభ', 'హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్' ద్వారా యువతను చైతన్యపరిచారు.

లాలా లజపతిరాయ్ హత్యకు నిరసన: సైమన్ కమిషన్ నిరసనల్లో లాలా లజపతిరాయ్ పై జరిగిన దాడికి ప్రతీకారంగా స్కాండర్స్ అనే బ్రిటిష్ పోలీస్ అధికారిని హెచ్చరిస్తూ చేసిన పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో మైలురాయిగా నిలిచింది.

కేంద్ర అసెంబ్లీలో బాంబు దాడి: బ్రిటిష్ ప్రభుత్వ నల్ల చట్టాలకు (ట్రేడ్ డిస్ప్యూట్స్ బిల్లు) నిరసనగా 'ఎవరినీ గాయపరచడం మా ఉద్దేశం కాదు, చెవిటి వారికి వినపడేలా చేయడమే మా లక్ష్యం' అని చాటుతూ సెంట్రల్ అసెంబ్లీలో బాంబులు విసిరి, “ఇంక్విలాబ్ జిందాబాద్” అని నినదించారు.

జైలులో నిరాహార దీక్ష: జైలులో భారతీయ ఖైదీలకు సమాన హక్కులు, సరైన వసతుల కోసం 63 రోజుల పాటు వీరోచితంగా నిరాహార దీక్ష చేశారు.

కేవలం 23 ఏళ్ల వయస్సులోనే రాజగురు, సుఖ్‌దేవ్‌లతో కలిసి నవ్వుతూ ఉరికంబాన్ని ముద్దాడిన భగత్ సింగ్ త్యాగం నేటి యువతకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని నాయకులు పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రమశక్తి అవార్డు గ్రహీత కొండ రాజు , ఆడెపు శంకర్ , నీలం వినీత్ , మాలివిజయ్ గూడెపు ప్రభాకర్ మరియు తదితరులు పాల్గొన్నారు...

# డ్రైవింగ్ లైసెన్స్‌దారులకు అలర్ట్.. గాబరా వద్దు!

**మొబైల్ నంబర్ లింక్ చేయకపోతే లైసెన్స్ రద్దవుతుందన్న ప్రచారం అవాస్తవం**

**మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 28**




తెలంగాణ: డ్రైవింగ్ లైసెన్స్‌కు మొబైల్ నంబర్‌ను తప్పనిసరిగా లింక్ చేయించుకోవాలని, ఈ నెలాఖరులోగా నంబర్ లింక్ చేయించుకోకపోతే డ్రైవింగ్ లైసెన్స్ రద్దవుతుందని గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి.అయితే ఈ ప్రచారంపై వాహనదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేసినట్లు సమాచారం. మొబైల్ నంబర్ లింక్ చేయలేదనే కారణంతో డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు చేసే నిబంధన ప్రస్తుతం లేదని వెల్లడించారు. అయితే డ్రైవింగ్ లైసెన్స్‌కు మొబైల్ నంబర్‌ను అప్‌డేట్ చేసుకోవడం ద్వారా రవాణా శాఖకు సంబంధించిన సమాచారం, ఫ్లూలు, ఇతర సేవల వివరాలు సులభంగా పొందవచ్చు. కాబట్టి వాహనదారులు సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మకుండా, అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని సూచిస్తున్నారు.

# గిరిజనుల భూములకు హక్కు పాత్రలు ఇవ్వాలి

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మన దునియా:**



కామారెడ్డి: హాజీపూర్ తండా భూములకు పట్టా హక్కు పత్రాలు ఇవ్వాలని గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

70 కుటుంబాలు..

గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోతీరాం నాయక్ మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి మండలం హాజీపూర్ తండాలో 70 కుటుంబాలు గత 60 ఏళ్లుగా సర్వే నంబర్ 66లో 40 ఎకరాలు, 176లో 13 ఎకరాలు, 177లో 40 ఎకరాలు, అదనంగా 40 ఎకరాల పోడు భూమిని సాగు చేసుకుంటున్నాయని తెలిపారు. ఇప్పటి వరకు ఒక్క గుంట భూమికి కూడా పట్టా ఇవ్వలేదని, అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. రెండు విడతలుగా పోడు భూములకు పట్టాలు ఇచ్చినా హాజీపూర్ తండా వాసులకు ఒక్క సెంటు కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.అటవీ అధికారులు రోజూ తండాలో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, కేసులు పెడతామని, జైలుకు పంపుతామని బెదిరిస్తూ పది మంది పేర్లు ఇవ్వాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. 2005 చట్టం ప్రకారం రెవెన్యూ, అటవీ భూమి అయినా సరే సర్వే చేసి హక్కుపత్రాలు ఇవ్వాలని, గిరిజనులను ఇబ్బంది పెట్టడం సరికాదని అన్నారు. వెంటనే సర్వే నిర్వహించి 70 కుటుంబాలకు పట్టా హక్కు పత్రాలు ఇచ్చి ఆదుకోవాలని కలెక్టర్ ను కోరినట్లు తెలిపారు. గిరిజన సంఘం జిల్లా నాయకులు వినోద్, ఎంపీటీసీ కిషన్ నాయక్, నరేష్ నాయక్, శంకర్ నాయక్, దేవుల నాయక్, సురేందర్ నాయక్, దేవిసింగ్ పాల్గొన్నారు.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# సింగరేణి ధర్నాను 30వ తేదీన విజయవంతం చేయండి





**మన దునియా, సెప్టెంబర్28,మంచిర్యాల జిల్లా**

బిజెపి ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదిన జరగబోయే సింగరేణి ధర్నాను విజయవంతం చేయాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దుర్గం అశోక్, సీనియర్ నాయకులు దేవరవేణి సంజీవరావు, డి వి దీక్షితులు సోమవారం సమావేశంలో కోరారు. ఈ సందర్బంగా దుర్గం అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థ కు 55వేల కోట్ల బకాయిలు చెల్లించాలని సింగరేణి సంస్థ కు, కార్మికులకు నష్టం వాటిల్లుతుందని నస్పూర్ లో జరిగే సింగరేణి ధర్నా కు రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు, మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, శాసనసభ పక్ష నాయకులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి సింగరేణి కార్మికుల హక్కుల కోసం హాజరు అవుతున్నారని అన్నారు. సింగరేణి బకాయిలు, బిజెపి లాడాయి నినాదంతో బిజెపి రాష్ట్ర కమిటి పిలునిచ్చారాని, 2025,2026 లాబాలనుండి 40%సింగరేణి కార్మికులకు కేటాయిస్తే ఆనందంగా ఉంటారని, సింగరేణి కార్మికుల సంక్షేమము భద్రత పట్ల అడుగడుగునా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ కార్మికుల పక్షాన బిజెపి పార్టీ ఉంటుందని, ఈ సింగరేణి ధర్నా కు పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షుడు గిర్నాటి జనార్దన్, జిల్లా కార్యదర్శి శనిగరాపు శ్రీనివాస్, రామటెంకి దుర్గారాజ్, జక్కుల మహేష్, సల్లూరి సుధాకర్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్‌పై దాడి.. పోలీసుల తీరుపై జీవన్‌రెడ్డి ఆగ్రహం









**బస్వరాజ్‌కు అండగా ఉంటాం.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి**

**రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఉందా? : మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి**

**జర్నలిస్టులపై కేసులు, దాడులు సరికాదు**

**అవినీతి,అక్రమాలపై వార్తలు రాస్తే వేధింపులా?**

**చట్టం అందరికీ సమానంగా అమలు కావాలి**

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**

నిజామాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ బస్వరాజ్‌పై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్న ఆరోపణలపై మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టులపై దాడులు, కేసులు నమోదు చేయడం బాధాకరమని అన్నారు. బస్వరాజ్‌కు తాము అండగా ఉంటామని స్పష్టం చేశారు. బస్వరాజ్‌పై దాడి జరిగినట్లు వైద్యులు నిర్ధారించారని ఆయన పేర్కొంటూ, ఘటనకు బాధ్యులైన ఎస్సై, కానిస్టేబుల్‌తో పాటు సంబంధిత పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవినీతి, అక్రమాలపై వార్తలు రాసే జర్నలిస్టులను వేధించడం, వారిపై కేసులు నమోదు చేయడం సరికాదన్నారు.

**04 మంది జర్నలిస్టులపై కేసులా?**

ఒకేసారి సుమారు 04 మంది జర్నలిస్టులపై కేసులు ఎలా నమోదు చేస్తారని జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. జర్నలిస్టులు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్నారని, వారి విధుల్లో జోక్యం చేసుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు.

**తీవ్ర నేరాలపై చర్యలు ఏవి?**

కిడ్నాప్‌లు, అత్యాచారాలు, హత్యలు వంటి తీవ్రమైన నేరాలపై అధికారులు ఏ మేరకు స్పందిస్తున్నారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. గంజాయి విక్రయాలు, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసులు కఠినంగా వ్యవహరించాలని సూచించారు.

**చట్టం అందరికీ సమానమేనా?**

రాజకీయ నాయకులు ఎవరైనా చట్టానికి అతీతులు కారని, చట్టం అందరికీ సమానంగా అమలు కావాలని జీవన్‌రెడ్డి అన్నారు. నాలుగో స్థంభంగా భావించే జర్నలిస్టులపై దాడులు జరగడం ఆందోళనకరమన్నారు.

**మరోసారి పూర్తి వివరాలతో ముందుకు..**

పోలీసుల తీరుపై మరింత అధ్యయనం చేసి, పూర్తి వివరాలతో మరోసారి ప్రజల ముందుకు వస్తానని జీవన్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో జర్నలిస్టులకు రక్షణ లేదని ఆయన విమర్శించారు. బస్వరాజ్ వ్యవహారంలో జరిగిన పరిణామాలపై సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## విలేఖరులమంటూ వద్ద లారీ అడ్డగింత..

## రూ.1.20 లక్షలు డిమాండ్!

**నలుగురు విలేకరులు అరెస్ట్.**

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**



డ్రైవర్‌ను బెదిరించి వసూళ్లకు యత్నం.. నలుగురు అరెస్ట్ కారు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం విలేఖరులమంటూ వద్ద లోడ్‌తో వెళ్తున్న లారీని అడ్డగించి డ్రైవర్‌ను బెదిరిస్తూ రూ. 1.20 లక్షలు డిమాండ్ చేసిన ఘటనలో ఎల్లారెడ్డి పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. లారీని అడ్డుకున్న నిందితులు తాము విలేఖరులమని చెప్పి డ్రైవర్‌ను భయపెట్టి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి ఒక కారు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. చట్టవిరుద్ధ చర్యలకు ఉపేక్ష లేదు వృత్తి లేదా హోదాను అడ్డుపెట్టుకుని అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్పీ రాజేష్ చంద్ర హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ.. వృత్తి లేదా హోదాను అడ్డుపెట్టుకుని చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని స్పష్టం చేశారు. ప్రజలను బెదిరించి డబ్బులు డిమాండ్ చేయడం, వసూళ్లకు పాల్పడడం వంటి చర్యలను ఉపేక్షించబోమని హెచ్చరించారు.

## డ్రగ్స్ నిషేధంపై అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మన దునియా:**

నిజామాబాద్ జిల్లా

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, మేరా యువభారత్ మరియు విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నశాముక్త యువ వికసితభారత్ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల మరియు కళాశాలలో నా ఆరోగ్యమే నా గర్వకారణం అనే నినాదంతో నిర్వహించడం జరిగింది. ఈరోజు ఎస్ ఎస్ ఆర్ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అడిషనల్ కలెక్టర్ స్థానిక సంస్థల శ్రీ భుజంగరావు హాజరయ్యారు. ముందుగా కార్యక్రమాన్ని ఉద్దేశించి మేరా యువభారత్ నశాముక్త వికసిత్ భారత సంకల్ప అభియాన్ పురస్కరించుకొని డ్రగ్స్ నిషేధంపై ప్రతిజ్ఞ మరియు అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ యువత వారి వ్యక్తిగత జీవితాన్ని మత్తు పదార్థాలకు బానిసలై కోల్పోతున్నారని ఏ సందర్భంలోనైనా ఎటువంటి మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండాలని అన్నారు. మత్తు పదార్థాలు లేని భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములమై కట్టుబడి ఉండాలని అంతేకాకుండా ప్రతి ఒక్కరి కుటుంబం స్నేహితులు బంధువులు పొరుగువారు మరియు అందరూ మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. వికసిత భారత్ కోసం నషాముక్త యువత అనే సంకల్పాన్ని నెరవేర్చడంలో ప్రతి ఒక్కరి సహకారాన్ని అందించాలని కోరారు. ప్రతి ఒక్కరూ జీవితంలో ఉత్తమ నైతిక విలువలను పాటిస్తూ మత్తు పదార్థాలు లేని జీవితాన్ని గడపాలని సమాజంలోని ప్రతి ఒక్కరికి అవగాహన కలిగిస్తూ చైతన్యవంతమైన సాధికారత కలిగిన మరియు నశాముక్త భారత దేశ నిర్మాణానికి నిరంతరం కృషి చేయాలని డ్రగ్స్ రహిత భారతదేశం కోసం పాటుపడాలన్నారు. ముఖ్యంగా ప్రొఫెషనల్ కాలేజీలు, ఇంజనీరింగ్ కళాశాలలో యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు ప్రతిరోజు వారిని గమనిస్తూ ఉండాలన్నారు. అదేవిధంగా అడిషనల్ కలెక్టర్ ఆధ్వర్యంలో నషాముక్త యువ ఫర్ వికసితభారత్ సంకల్పబియాన్ పై విద్యార్థినీ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డిఎంహెచ్ఓ డాక్టర్ బి రాజశ్రీ మాట్లాడుతూ యువత కోసం 100 ఆదివారాలు ప్రత్యేకంగా పని చేయడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దని వారి బంగారు భవిష్యత్తు చేతులారా నాశనం చేసుకోవద్దని మన ఆరోగ్యం మన చేతుల్లో ఉందని అన్నారు. అదేవిధంగా మానసిక వ్యాధులు ఉన్నవారు టోల్ ఫ్రీ నెంబర్ 14416కు కాల్ చేసి జిల్లా సైకియాట్రిస్ట్ ద్వారా సలహాలు సూచనలు చికిత్స పొందాలని తెలియజేశారు. ఈ సందర్భంగా మానసిక వ్యాధుల నిపుణులు డాక్టర్ రవితేజ మాట్లాడుతూ తీవ్రవాద దేశాల నుండి మత్తు పదార్థాలను గంజాయిని భారత దేశంలోకి రహస్యంగా చేరవేస్తున్నారని ప్రతి ఒక్క యువత అప్రమత్తంగా ఉండి మత్తు పదార్థాలకు గంజాయికి బానిస కాకుండా ఉండాలన్నారు. స్మోకింగ్ డ్రింకింగ్ మత్తు పదార్థాలు డ్రగ్స్ ఆల్కహాల్ లాంటి వ్యసనాలకు బానిసలైన ఎవ్వరైనా జిల్లా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో నిర్వహించే డి అడిక్షన్ సెంటర్ కి రిఫర్ చేయాలని ఉచిత చికిత్స అందిస్తున్నామని దీన్ని అందరూ ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు. నశాముక్త యువ వికసిత భారత్ సంకల్ప అభియాన్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి రవికుమార్ , డి ఐ ఓ డాక్టర్ అశోక్ ,జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ సికందర్ నాయక్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ వెంకన్న, ఆర్ బి ఎస్ కే కోఆర్డినేటర్ డాక్టర్ నవ్య, ఎయిడ్స్ అండ్ లెప్రసీ మెడికల్ అధికారి డాక్టర్ భార్గవి, వివో ఎమ్ సి హెచ్ డాక్టర్ శిఖరా,డిప్యూటీ డెమో దుర్గారావు, డిహెచ్ఈ ఘన్పూర్ వెంకటేశ్వర్లు, డిపిఎమ్ఓ సుధాకర్, కళాశాల విద్యార్థిని విద్యార్థులు, వివిధ స్వచ్ఛంద సేవ సంస్థల ప్రతినిధులు, వైద్య సిబ్బంది , కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



మన దునియా

RNI Number TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం

# మూర్ఖులతో వాదిస్తే మనమూ మూర్ఖులమే: ఫ్యాన్స్‌కు సూర్య హితవు



తమిళ స్టార్ హీరో సూర్య తన అభిమానులకు కీలక సూచనలు చేశారు. సోషల్ మీడియాలో జరిగే ఫ్యాన్ వార్స్‌లో పాల్గొనవద్దని, ఆన్‌లైన్ ట్రోల్స్‌ను పట్టించుకోవద్దని హితవు పలికారు. "మూర్ఖులతో వాదిస్తే మనం కూడా మూర్ఖుల్లాగే కనిపిస్తాం" అని ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.అఖిల భారత సూర్య ఫ్యాన్స్ క్లబ్ నిర్వహించిన ఓ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. "మనం ప్రేమను మాత్రమే పంచుదాం. ఎవరో ఓ మూర్ఖుడు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడని మనం కూడా స్పందిస్తే, చివరికి మనం కూడా మూర్ఖులమే అవుతాం, బాధపడతాం. మనం మనలా ఉందాం, వాళ్లను వాళ్లలా ఉండనీయండి. వాళ్లకు నచ్చజెప్పాలని, మార్చాలని ప్రయత్నించడం కష్టం. కొంతమంది అర్థం చేసుకున్నా, చాలామంది మారరు. మీ శక్తిని వృథా చేసుకోవద్దు. మీకు ఇష్టమైన పనిని ప్రతిరోజూ నిబద్ధతతో చేయండి, విజయం తప్పక వరిస్తుంది" అని సూర్య అభిమానులకు దిశానిర్దేశం చేశారు.కోలీవుడ్‌లో హీరోల అభిమానుల మధ్య సోషల్ మీడియాలో తీవ్రస్థాయిలో ఫ్యాన్ వార్స్ జరగడం సాధారణమే. ముఖ్యంగా కొత్త సినిమాలు విడుదలైనప్పుడు ఈ ట్రోలింగ్ మరింత ఎక్కువవుతుంది. ఈ క్రమంలో నటుడు సూర్య కూడా తరచూ ట్రోలింగ్ బారిన పడుతుంటారు. ఈ నేపథ్యంలోనే ఆయన తన అభిమానులకు ఈ విధంగా సూచనలు చేసినట్లు తెలుస్తోంది.అయితే, సూర్య వ్యాఖ్యలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది ఇతర హీరోల అభిమానులు, ఆయన తమను 'మూర్ఖులు' (ముట్టల్) అని పిలుస్తున్నారని, ఆయన భాషలో పరిణతి లేదని విమర్శిస్తున్నారు. మరోవైపు, సూర్య అభిమానులు మాత్రం ఆయనకు మద్దతుగా నిలుస్తున్నారు. "ఈ మాటలు మీకు తగిలితే, సూర్య చెబుతున్న ఆ మూర్ఖులు మీరే" అంటూ కౌంటర్లు ఇస్తున్నారు.ఈ ఏడాది సూర్యకు వ్యక్తిగతంగా, వృత్తిపరంగా బాగా కలిసొచ్చింది. ఇటీవల తన భార్య జ్యోతికతో 20వ వివాహ వార్షికోత్సవాన్ని స్కాట్లాండ్‌లో జరుపుకున్నారు. ఆయన నటించిన 'కరుప్పు', 'విశ్వనాథ్ ఽ సన్స్' చిత్రాలు వరుసగా విజయాలు సాధించాయి. ఇటీవలే హీరోలు విజయ్, అజిత్ కుమార్ మధ్య స్నేహపూర్వక వాతావరణం కనిపించడం, ట్రోల్స్‌ను పట్టించుకోవద్దని అజిత్ కూడా గతంలో అభిమానులకు సూచించడం వంటి పరిణామాల నేపథ్యంలో సూర్య వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## అర్ధరాత్రి ఆలయంలో పెద్ద సౌండ్‌తో మ్యూజిక్.. పోలీసులకు ఫిర్యాదు చేసిన అల్లు శిరీష్!

**వినోభానగర్ హనుమాన్ ఆలయంలో అర్ధరాత్రి పెద్ద సౌండ్**

**పెద్దలు, పిల్లలు నిద్రలేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన**

**గతంలో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని వెల్లడి**

**సోషల్ మీడియా వేదికగా హైదరాబాద్ పోలీసులకు విజ్ఞప్తి**

సినీ నటుడు అల్లు శిరీష్ శబ్ద కాలుష్యంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియా వేదికగా ఆయన ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. వినోభానగర్‌లోని ఓ ఆలయం నుంచి అర్ధరాత్రి వేళ కూడా పెద్ద శబ్దంతో సంగీతం వస్తుండటంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని ఆయన పేర్కొన్నారు.తాను షేక్‌పేట్‌లోని అపర్ణా వన్ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నానని, తమ నివాసానికి సమీపంలో ఉన్న వినోభానగర్ హనుమాన్ ఆలయంలో గత కొద్ది రోజులుగా రాత్రి 2, 3 గంటల వరకు కూడా పెద్ద శబ్దంతో సంగీతం పెడుతున్నారని అల్లు శిరీష్ తన 'ఎక్స్' పోస్టులో ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఓ వీడియోను కూడా ఆయన షేర్ చేశారు.ఈ సమస్యపై తాను ఇప్పటికే ఫిల్మ్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని శిరీష్ తెలిపారు. అయితే, గణేష్ నిమజ్జనం వరకు సర్దుకుపోవాలని వారు సూచించినట్లు చెప్పారు. పండుగ ముగిసినప్పటికీ శబ్దాలు ఆగకపోవడంతో మరోసారి ఫిర్యాదు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ పెద్ద శబ్దాల వల్ల తమ సొసైటీలోని వృద్ధులు, పిల్లలు, ఉద్యోగాలకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, దయచేసి ఈ విషయంపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ సిటీ పోలీసులను ఆయన కోరారు.







# హీరో భార్యకు నచ్చలేదని నన్ను తీసేశారు: తాప్సీ

**కెరీర్ తొలినాళ్లలో బాలీవుడ్‌లో ఎదురైన చేదు అనుభవాలు వెల్లడించిన తాప్సీ**

**ఓ స్టార్ హీరో కూడా తనను ప్రాజెక్ట్ నుంచి తప్పించాడని వ్యాఖ్య**

**టైప్‌కాస్ట్ కాకుండా ఉండేందుకు కొన్ని ఆఫర్లు వదులుకుంటున్నట్లు వెల్లడి**

ప్రముఖ నటి తాప్సీ తన కెరీర్ ఆరంభంలో బాలీవుడ్‌లో ఎదుర్కొన్న కొన్ని అవమానకరమైన అనుభవాలను పంచుకున్నారు. హీరో భార్యకు తాను నచ్చలేదనే వింత కారణంతో తనను ఓ సినిమా నుంచి తనను తొలగించారని వెల్లడించారు. ఇటీవల నయన్‌దీప్ రక్షిత్‌కు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తాప్సీ ఈ షాకింగ్ విషయాలను పంచుకున్నారు.తాప్సీ మాట్లాడుతూ, "ఓ సినిమాకు సంతకం చేసిన తర్వాత నన్ను తొలగించారు. కారణం ఏంటని అడిగితే, 'హీరో భార్యకు మీరు నచ్చలేదు' అని చెప్పారు. ఆ హీరో భార్యకు నేనెందుకు నచ్చలేదో ఇప్పటికీ నాకు తెలియదు" అని గుర్తుచేసుకున్నారు. అయితే ఆ నటుడు, ఆయన భార్య ఎవరనేది మాత్రం ఆమె వెల్లడించలేదు. మరో సందర్భంలో, ఓ ప్రముఖ హీరో తన స్థానంలో అతడికి బాగా సన్నిహితురాలైన నటిని తీసుకోవడం కోసం తనను సినిమా నుంచి తప్పించారని తాప్సీ పేర్కొన్నారు.అదే సమయంలో, పరిశ్రమలో నటీనటులను ఒకేరకమైన పాత్రలకు పరిమితం చేసే (టైప్‌కాస్ట్) ధోరణిపై కూడా తాప్సీ స్పందించారు. కొందరిని గ్లామర్ పాత్రలకు, మరికొందరిని సీరియస్ పాత్రలకు పరిమితం చేస్తారని, తన విషయంలో అలా జరగకుండా ఉండేందుకే కొన్ని ఆఫర్లను స్పష్టంగా తిరస్కరిస్తున్నానని ఆమె తెలిపారు. కాగా, తాప్సీ ఇటీవల 'అస్సి', 'గాంధారి' వంటి చిత్రాల్లో తన నటనతో ప్రశంసలు అందుకున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2O23/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com